క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు చేపట్టిన మరమ్మతుల్లో భాగంగా 4 మండలాలకు పాక్షికంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏడీఈ నీలి గోవిందు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూరాల సబ్‌స్టేషన్‌కు సంబంధించిన 220 కేవీలోని 100 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 160 ఎంవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 25 నుంచి ఫిబ్రవరి 1 వరకు అయిజ సబ్ డివిజన్ పరిధిలోని అయిజ, రాజోళి, గట్టు, మల్దకల్ మండలాల్లోని అన్ని 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

నేడు వీడ్కోలు సమావేశం



అయిజ : మున్సిపాలిటీలో పాలకవర్గం ఏర్పడి 5 సంవత్సరాలకాలం పూర్తయ్యిందని, వారికి సన్మానం నిర్వహించి వీడ్కోలు పలుకుదామని అఖిలపక్షం కమిటీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. శుక్రవారం వారి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. శనివారం ఉదయం 10 గంటలకు సమీకృత మార్కెట్ భవనంలో వీడ్కోలు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అఖిల పక్షం కమిటీ నాయకులు తాహేర్, విజయ భాస్కర్‌రెడ్డి, సుధాకర్, అంజి, మల్లికార్జున్, వెంకట్రాముడు, ఆంజనేయులు, తిరుమలరెడ్డి, మద్దిలేటి, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైంపై విద్యార్థుల ర్యాలీ



ఉండవెల్లి : మండలంలోని పుల్లూరు, కలుగోట్ల, బొంకూరు గ్రామాల్లో విశ్వశాంతి విద్యా సంస్థల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి సైబర్ క్రైమ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటీపీ, మెసేజ్‌లు పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రత్యూష, శారద, వినీత, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

90 రోజుల ప్రణాళిక కచ్చితంగా పాటించాలి



అయిజ : కమిషనర్ ఆదేశాల ప్రకారం 90 రోజుల ప్రణాళిక కచ్చితంగా పాటించాలని ఇంటర్మీడియట్ అధికారి హృదయరాజు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అధ్యాపకులతో మాట్లాడారు. వివిధ సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాములు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

సంవిధాన్ గౌరవ అభియాన్



అయిజ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో శుక్రవారం బీజేపీ నాయకులు సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులకు భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ప్రదీప్ కుమార్, పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల అభ్యున్నతికి కృషి

మానవపాడు : బాలికల అభ్యున్నతికి కృషి చేయాలని కేజీబీవీ ఎస్ఓ అనురాధ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలలో ఘనంగా జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. బాలికల రక్షణ మనందరి బాధ్యతగా భావించాలన్నారు. సామాజిక, ఆర్థిక, ఆరోగ్య పరంగా బాలికల ఉన్నతి కోసం సమష్టిగా చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గట్టులో..

గట్టు : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంవీఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ సాయి మాట్లాడుతూ.. ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో ఆడపిల్లల సమానత్వ సమాఖ్య ద్వారా ఉన్నత పాఠశాలల బాలికలను ఏకం చేస్తున్నట్లు తెలిపారు. బడి బయట బాలికల సంఖ్యను తగ్గించి, అక్షర జ్ఞానాన్ని పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం నర్సింహులుగౌడ్ మాట్లాడుతూ.. బాలికలు సావిత్రిబాయి పూలే లక్షణాలను పునికి పుచ్చుకుని, రాణిరుద్రమ నాయకత్వ లక్షణాలతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ ఉమెన్ ఎంపవర్మెంట్ లక్ష్మీదేవి, టీఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్, రజిత, వీరేష, వీణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో..

శాంతినగర్ : వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవ వేడుకలను ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, అంగన్‌వాడీ సూపర్ వైజర్ పుష్పావతిలు బాలికలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఏపీ చైర్మన్ సురేషమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

మల్దకల్ : బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్దకల్ కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలు చదువు కోవడం ద్వారా ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. అనంతరం బాలికలకు పెన్నులు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, రెడ్డప్ప, దామ నాగరాజు, వెంకటన్న, గోకారి, వీరన్న గౌడ్, మల్లికార్జున్ గౌడ్, ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంరక్షణ కోసం పటిష్ట చట్టాలు

రాజోళి : బాలికల సంరక్షణ కోసం పటిష్ట చట్టాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని బాలికల ద్వారా సమాజంలో చైతన్యం వస్తుందని ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జి హనిమిరెడ్డి, ఎంఈఓ భగీరథ రెడ్డి అన్నారు. మండలంలోని పెద్ద తాండ్రపాడు గ్రామంలో జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. బాలికలు విద్యావంతులయితే వారి కుటుంబం మొత్తం విద్యావంతులు అవుతారన్నారు. బాలికల హక్కులకు భంగం కలిగితే ప్రత్యేక చట్టం ద్వారా కేసులు నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం వెంకటేశ్వర్ రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీ, సీఆర్‌పీఎఫ్ కమిటీ సభ్యులు విక్రమసింహా రెడ్డి, ప్రభుదాస్, సంతోషమ్మ, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పాతపాలెంలో..

కేటీదొడ్డి : మండల పరిధిలోని పాతపాలెం గ్రామంలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గ్రామంలోని రైతు వేదికలో జిల్లా మహిళా శిశు సంక్షేమ, ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనా అధికారి ప్రియాంక హాజరై మాట్లాడారు. బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలపై వివరించారు. విద్య, పోషణ, చట్ట పరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహం వంటి అంశాలపై మాట్లాడారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి నర్సింహ మాట్లాడుతూ.. బాల్య వివాహం చట్ట రీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్ జయభారతి, సీడీపీఓ వెంకటేశ్వరి, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పాతపాలెంలో మాట్లాడుతున్న జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారులు



రామాపురంలో బెలూన్లు ఎగురవేస్తూ వేడుకలు జరుపుకుంటున్న బాలికలు



గట్టు ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

గట్టు : పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మైండ్ ట్రీ, భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మండల పరిధిలోని గొర్లఖాన్‌దొడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయుల సహకారంతో సంస్థ ప్రతినిధులు పాఠశాల ఆవరణ శుభ్రం చేశారు. ఆవరణల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భవిష్య భారత్ బృందం పీఎస్ఓ మునిస్వామి, సీఓ పరమేష్ ఆచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదే విధంగా తుమ్మలచెరువులో గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గైనకాలజిస్ట్ వనిత ఆధ్వర్యంలో వైద్య పరీక్షలను నిర్వహించి, మందులు అందజేశారు. గర్భిణులు సరైన పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం బాలరాజు, రాగిణి, జిలాని, ఆశా వర్కర్లు, విజయలక్ష్మీ, శ్రీదేవి, హాలీంపాష తదితరులు పాల్గొన్నారు.



గొర్లఖాన్‌దొడ్డిలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

గట్టు : మండల కేంద్రానికి చెందిన సీనియర్ న్యాయవాది గట్టు సంఘం సురేష్ తమ్ముడు సంఘం శివప్ప(52) కుటుంబ సభ్యులను శుక్రవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పరామర్శించారు. సంఘం శివప్ప గురువారం రాత్రి గుండె పోటుతో గద్వాలలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గట్టుకు చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ వీరభద్రప్ప, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

మల్దకల్ : ప్రభుత్వం సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మల్దకల్ రైతు వేదికలో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో పాటు జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పథకాల అమలుపై అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి సంక్షేమ పథకాలను అందజేస్తామన్నారు. ఆయా గ్రామాల్లో అధికారులు లబ్ధిదారుల జాబితా వివరించారు. అదే విధంగా మల్దకల్ రైతువేదిక సమీపంలో ఇందిరమ్మ ఇంటి నమూనాకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, తహసీల్దార్ జుబేర్ మొయిద్దీన్, ఎంపీఓ రాజశేఖర్, డీటీ రూప్సీరాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తిమ్మారెడ్డి, సీతారామిరెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, సత్యారెడ్డి, విక్రంసింహరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజారెడ్డి, నరేందర్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటన్న, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రజాపాలన గ్రామసభలు..

శాంతినగర్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల, కొంకల గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. అర్హుల జాబితాను చదివి వినిపించారు. అనంతరం ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఏపీఎం మహేష్, పంచాయతీ కార్యదర్శి హరిత ప్రజలు పాల్గొన్నారు.

అయిజలో..

అయిజ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామసభలు మున్సిపాలిటీలో మమ అనిపించారని 4, 8, 12, 16, 20 వార్డు ప్రజలు ఆరోపించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా దరఖాస్తులు నాలుగు రోజుల పాటు స్వీకరించలేదని తెలిపారు. అదే విధంగా మండలంలోని మేడికొండ పులికల్, జడదొడ్డి, చిన్న తాండ్రపాడు, తూంకుంట, మూగోనిపల్లి, ఉప్పల గ్రామాల్లో గ్రామసభలు మొక్కుబడిగా సాగాయన్నారు.

ఇటిక్యాలలో..

ఇటిక్యాల : మండల పరిధిలోని మొగలిరావుల చెర్వు, వావిలాల గ్రామాల్లో శుక్రవారం అధికారులు గ్రామసభలు నిర్వహించారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, డీటీ నందిని, ఆర్ఐ భీంసేన్ రావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిలో..

ఎర్రవల్లి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన గ్రామసభలు శుక్రవారంతో ముగిసాయి. చివరిరోజు మండలంలోని కోదండాపురం, బి.వీరాపురం, సాసనూలు, వల్లూరు గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించి పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పథకాల లబ్ధి కోసం దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఎంపీడీఓ అజార్ మొహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

కేటీదొడ్డి : గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సాహెదా బేగం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా వంటి పథకాలకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

గ్రామసభల్లో వినతుల వెల్లువ..

గట్టు : ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు ఆయా గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు పెద్ద ఎత్తున దరఖాస్తూలు చేసుకున్నారు. చిన్నోనిపల్లె, ముచ్చోనిపల్లె, తుమ్మలచెరువు, బల్గెర, యల్లందొడ్డి, తారాపురం గ్రామాల్లో అధికారులు ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు.కార్యక్రమంలో తహసీల్దార్ వీరభద్రప్ప, ఎంపీడీఓ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామసభలు..

ధరూరు : రాష్ట్ర ప్రభుత్వం సంక్షే పథకాల దరఖాస్తుల స్వీకరణకు గత నాలుగు రోజులుగా నిర్వహించిన గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. గ్రామ సభల నాల్గవ రోజు మండల పరిధిలోని మార్లబీడు, దోర్నాల, నీలహళ్లి, గార్లపాడు, ఉప్పేరు, పెద్దపాడు తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మల్దకల్ గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



వెంకటాపురంలో గ్రామసభలో అధికారులు



బోయలగూడెంలో..

రైతుభరోసా దరఖాస్తుల స్వీకరణ

అయిజ : రైతు భరోసా పథకం ద్వారా యాసంగి సాగుకు వ్యవసాయ పెట్టుబడి సాయం పొందేందుకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం వచ్చిన రైతుల నుంచి వ్యవసాయ అధికారులు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి జనార్దన్ మాట్లాడుతూ.. రైతులు దరఖాస్తు పత్రానికి పట్టాదారు పాస్ పుస్తకం లేదా డిజిటల్ సంతకం చేసిన జిరాక్స్, ఆధార్ జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ బుక్ జిరాక్స్‌ను సంబంధిత ఏఈఓకు అందజేయాలని సూచించారు. అదే విధగా పెట్టుబడి సాయం కోసం రైతులు బ్యాంక్ ఖాతాలను మార్చాలనుకుంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు భరోసా పథకం కింది అర్హులైన రైతులకు సాయం అందించేందుకు 2025 జనవరి 1 తేదీ నాటికి భూ భారతి (ధరణి) పోర్టల్‌లో ఉన్న పట్టాదారుల డేటాను భూమి పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నుంచి స్వీకరించినట్లు తెలిపారు. గతంలో రైతుబంధు పొందిన రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని ఎంఏఓ పేర్కొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈఓ యువరాజు

‘భగీరథ’లో మురుగు నీరు

మానవపాడు : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ నీరు ద్వారా ఆస్పత్రుల పాలవుతున్నట్లు మండల కేంద్రంలోని బీసీ కాలనీ ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రంలో బీసీ కాలనీలో మిషన్ భగీరథ నీటిలో మురుగు నీరు కలుస్తుందని దీంతో రోగాల బారిన పడుతున్నట్లు తెలిపారు. అధికారులకు తెలిపినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా సమస్య ఉన్నా అధికారుల పర్యవేక్షణ కరువైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటిలో మురుగునీరు కలువకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మానవపాడు బీసీ కాలనీలో మిషన్ భగీరథ నీటిలోకి ప్రవాహిస్తున్న మురుగు నీరు

ప్రజాసేవలో శాశ్వత గుర్తింపు

అలంపూర్ : సమాజంలో ప్రజలకు చేసిన సేవలు శాశ్వతంగా గుర్తింపునిస్తాయని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. పట్టణంలో మున్సిపల్ పాలక మండలి వీడ్కోలు సమావేశం వికాస పరిరక్షణ సమితి, తెలంగాణ జాగృతి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. ముందుగా మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దేవన్న, నాయకులు నవాబ్ ఖాన్ చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం పాలక మండలి సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...అలంపూర్‌లో తొలిసారిగా కొలువు దీరిన మున్సిపల్ పాలక మండలి ప్రజల మన్ననలు పొందిందన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసికట్టుగా పని చేశారన్నారు. మున్సిపాలిటీని ప్రగతి పథంలో నడిపించి స్వచ్ఛ భారత్ అవార్డును దక్కించుకోవడం తొలి పాలక వర్గానికి నిరంతరం గుర్తింపుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పుష్పలత, లక్ష్మీదేవమ్మ, సకినాబీ, విజయలక్ష్మీ, సుష్మ, సరోజమ్మ, ఇంతియాజ్, సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

పట్టణంలో సీఎం సహాయ నిధి చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే విజయుడు లబ్ధిదారులకు అందజేశారు. సీఎం సహాయ నిధి నుంచి 12 మంది లబ్ధిదారులకు రూ. 2,57,500 మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



పాలక మండలి సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

గద్వాల క్రైం : వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఇన్‌చార్జి రవాణా అధికారి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం కృష్ణవేణి చౌరస్తాలో గద్వాల ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో వారు హాజరై మాట్లాడారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను ప్రతిఏటా నిర్వహించి వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేసేందుకు దోహద పడుతుందన్నారు. సీటుబెల్టు, హెల్మెట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు సామర్థ్యం కలిగిన వారు మాత్రమే రోడ్డు ప్రయాణాలు చేయాలన్నారు. అనంతరం పట్టణంలోని విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మురళీకృష్ణ, రవాణాశాఖ సిబ్బంది ఏఓ రమేష్‌కుమార్, రాములునాయక్, బాలచందర్ పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ర్యాలీ ప్రారంభిస్తున్న రవాణా అధికారి కృష్ణారెడ్డి

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

మానవపాడు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. కలెక్టర్, ఎంఈఓ, డీఈఓ, ఎంఈఓగా విద్యార్థులు పాఠశాలను సందర్శించి పరిశీలించడం, తనిఖీలు చేయడం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కేజీబీవీ ఎస్ఓ అనురాధ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో విద్యార్థులు

రసాభాసగా ముగిసిన గ్రామసభలు



క్యాతూర్‌లో అధికారులను ప్రశ్నిస్తున్న మహిళలు



చిన్నఆముదాలపాడులో ప్రజల వాగ్వాదం

అలంపూర్ రూరల్ : మండల పరిధిలోని క్యాతూర్, లింగన్‌వాయి, కాశీపూర్, ర్యాలంపాడ్ గ్రామాల్లో శుక్రవారం అధికారులు ఏర్పాటు చేసిన గ్రామ సభలు రసాభాసగా సాగాయి. కాశీపూర్, క్యాతూర్ గ్రామాల్లో లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు లేవంటు ప్రజలు ఆందోళన చేపట్టారు. అధికారులు మరలా దరఖాస్తులు చేసుకోవాలని ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చేస్తామనడంతో శాంతించిన ప్రజలు నూతన దరఖాస్తులను అధికారులకు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మావతి, తహసీల్దార్ మంజుల, ఏఓ నార్జున రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

గ్రామసభలో గందరగోళం..

మానవపాడు: నిజమైన అర్హుల పేర్లు లేవని ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభలో ప్రజలు, అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. శుక్రవారం తహసీల్దార్, మండల ప్రత్యేక అధికారి సక్రియనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభ తీవ్ర గందరగోళం మధ్య కొనసాగింది. సంక్షేమ పథకాల్లో తమ పేర్లు రాలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వామిదాకాతూన్, మండల ప్రత్యేక అధికారి సక్రియనాయక్ మాట్లాడారు. నిజమైన అర్హుల జాబితాను మరోకసారి పరిశీలించి జాబితాలో వారి పేర్లు వచ్చే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆముదాలపాడులో..

ఉండవెల్లి: మండలంలోని చిన్న ఆముదాలపాడు గ్రామంలో నిర్వహించిన గ్రామసభ ఘరం ఘరంగా సాగింది. శుక్రవారం చిన్న ఆముదాలపాడు, మారమునగాల-1, మెన్నిపాడు, ఇటిక్యాలపాడు గ్రామాల్లో గ్రామ సభలను ఎంపీడీఓ తిరుపతన్న, తహసీల్దార్ హరికృష్ణ, ఏఓ అనిత, పశువైద్యాధికారి శిరీష ఆధ్వర్యంలో నిర్వహించారు.

రైతుభరోసా తీసేస్తారా..

రాజోళి : భారత్ మాల రహదారి కోసం భూములు కోల్పోయిన రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం ఇవ్వకుండానే తమకు రైతు భరోసా తీసేస్తే ఎలా అని రైతులు ప్రశ్నించారు. మండల కేంద్రం రాజోళితో పాటు, మాన్‌దొడ్డి గ్రామంలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. తమకు పరిహారంగా రావాల్సిన డబ్బు ఇంకా రాలేదని అయినా కూడా తమకు రైతు భరోసా నిలిపేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.